క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


అరుణ్‌తో కరాటే మాస్టర్ బాలకృష్ణ

పెనుబల్లి: అండర్ –19 ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి కరాటే పోటీలకు మండలంలోని వీఎం.బంజర్‌కు చెందిన టైగర్ కరాటే స్కూల్ విద్యార్థి అరుణ్ తేజ ఎంపికయ్యాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆయన పాల్గొంటాడని కరాటే మాస్టర్ ఆర్.బాలకృష్ణ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన చేయూత


దుప్పట్లు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బోనకల్: మండల కేంద్రంలోని వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు చేతన ఫౌండేషన్ బాధ్యులు సోమవారం దుప్పట్లు అందజేశారు. అలాగే, అన్నదానం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవికుమార్‌తో పాటు సభ్యులు, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ వితరణ

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరంలో వేమిరెడ్డి వెంకటరెడ్డి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యరమల పూర్ణచంద్రారెడ్డి రూ.లక్ష విలువైన వాటర్ ప్యూరిఫైర్ అందజేశారు. ఈ ప్యూరిఫైర్‌ను సోమవారం ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, గొల్లపూడి కోటేశ్వరరావు, హనుమంతరావు తదితరులు దాతను అభినందించారు.

ముత్యాలగూడెం పాఠశాలకు బల్లలు..

కారేపల్లి: మండలంలోని ముత్యాలగూడెం ప్రాథమిక పాఠశాలకు అదే పాఠశాల ఉపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు రూ.10వేల విలువైన నాలుగు బల్లలు అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ జయరాజు మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తన సొంత నగదు బల్లలు అందజేయడం అభినందనీయమన్నారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ జ్యోతి, ఉపాధ్యాయులు బి.సుబ్బారావు, సంతులాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలి


సమస్యలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తుడు

ఎర్రుపాలెం: మండల ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉషాశారద సూచించారు. ఈసందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జమలాపురంలో ఎన్ఎస్‌పీ కాల్వ ఆక్రమణపై బొబ్బా ప్రసాద్ వినతిపత్రం అందచేయగా మరికొందరు సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఐసీడీఎస్ ఏసీడీపీఓ కృష్ణశ్రీ, ఆర్‌ఐ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. కాగా, బీసీ రిజర్వేషన్ల అంశంపై ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ఆసక్తి ఉన్న వారు వినతులు, అభ్యంతరాలు అందచేయవచ్చని తహసీల్దార్ ఎం.ఉషాశారద సూచించారు.

తక్షణమే ఇళ్లు మంజూరు చేయాలి

బోనకల్: పేద ప్రజలకు ప్రభుత్వం తక్షణమే ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో వారు అధికారులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని మోసం చేయగా, ప్రజాప్రభుత్వంగా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వమైనా తాత్సారం చేయకుండా ఇళ్ల పథకాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు యంగల ఆనందరావు, కిలారు సురేష్, నాయకులు ఆకెన పవన్, జయరాజు, ఏడుకొండలు, మనీష్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురానికి చెందిన వాసిరెడ్డి శ్రీనివాసరావు తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆన్‌లైన్‌లో ట్రేస్ చేసి ఫోన్‌ను గుర్తించారు. ఈమేరకు శ్రీనివాసరావుకు ఎస్‌ఐ వెంకటేష్ ఫోన్ అప్పగించగా ఏఎస్‌ఐ గోపాలరావు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు.. మురుగునీరు..

- ఇదీ సత్తుపల్లి పట్టణంలో పరిస్థితి
- దోమలు, ఈగలకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు
- ఫలితంగా ఇబ్బంది పడుతున్న ప్రజలు


కల్పతరురోడ్డులో ఇళ్ల మధ్య పిచ్చిచెట్ల నడుమ నిలిచిన మురుగు

సత్తుపల్లిటౌన్: ఖాళీస్థలాల్లో నిలిచిన మురుగునీరు.. పెరుగుతున్న పిచ్చిమొక్కలతో సత్తుపల్లి పట్టణ ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఓపెన్ ప్లాట్లను యజమానులు వదిలేయడంతో చెట్లు పెరిగి, మురుగునీరు నిలిచి దోమలు, ఈగలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో సమీప ప్రాంత ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అయినప్పటికీ ఖాళీ స్థలాల యజమానులపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్వహణ మరిచిపోవడంతో...

సత్తుపల్లి మున్సిపాలిటీలో 23 వార్డులు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా వెంగళరావునగర్, ద్వారకాపురి కాలనీ, అయ్యగారిపేట, కల్పతరు రోడ్డు, హనుమాన్‌నగర్, పాలవాడ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు కనిపిస్తున్నాయి. ఏళ్ల క్రితం స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు వీటి నిర్వహణను మరిచిపోవడంతో రోజుల తరబడి మురుగునీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. వర్షాలు పడినప్పుడు ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యలో పిచ్చిమొక్కలు గుబురుగా పెరగటంతో దోమలే కాక పాటు విష సర్పాలు, కీటకాలు ఆవాసం ఏర్పాటుచేసుకోగా ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోతున్నారు..

ఏళ్ల తరబడి ఖాళీగానే..

పట్టణంలోని పలు కాలనీలతో పాటు శివారు ప్రాంతాల్లో ఏళ్ల తరబడి స్థలాలు ఖాళీగా ఉంటున్నాయి. వీటిలో నిర్మాణాలు చేపట్టకపోగా కనీసం శుభ్రం చేయించడంపైనా యజమానులు శ్రద్ధ వహించడలేదు. చాలా మంది స్థలాలు కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి వదిలేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతుండడంతో పాటు దోమలు, పందులకు నిలయాలుగా మారుతున్నాయి. ఖాళీ ప్లాట్లలో మురుగునీరు నిలవకుండా, ఎప్పటికప్పుడు మొక్కలు తొలగించేలా యజమానులకు మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


వెంగళరావునగర్‌లో రోడ్డు వెంట చిట్టడవిని తలపించేలా మొక్కలు

ఈ చర్యలు చేపడితే మేలు..

- ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం చేరడం, వర్షపు నీరు నిలవడంతో కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది..
- ఇవి పేరుకుపోకుండా స్థల యజమానులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి.
- యాజమానులు విధిగా చదును చేయించేలా అధికారులు నోటీసులు జారీ చేయాలి.
- ప్లాట్లు లోతట్టు ప్రాంతాల్లో ఉంటే మట్టితో చదును చేయించుకోవాలి.
- భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం, రాళ్లు ఖాళీ స్థలాల్లో వేయకుండా పర్యవేక్షించాలి.

ఖమ్మం మాదిరి చర్యలు తీసుకోవాలి



ఖాళీ స్థలాలు ఏళ్ల తరబడి ఖాళీగా ఉండటం వల్ల చెట్లు, పొదలు, పుట్టలు పెరుగుతున్నాయి. దోమలు, ఈగల వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఖమ్మం కార్పొరేషన్‌లో ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇస్తున్నట్లుగా ఇక్కడా అధికారులు పర్యవేక్షించాలి.

– కె.సాల్మన్‌రాజు, సత్తుపల్లి

పరిశుభ్రంగా ఉండేలా..



పట్టణం పరిశుభ్రంగా ఉండేలా ప్రజలందరు సహకరించాలి. ఖాళీ స్థలాల్లోని పిచ్చిమొక్కలు లేకుండా యజమానులు శుభ్రం చేయించుకోవాలి. ఒక వేళ వారు పట్టించుకోకపోతే మున్సిపాలిటీ ఆధ్వర్యాన చర్యలు తీసుకుంటాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం.

– మందా రవిబాబు, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

చినిగిపోయిన గన్నీ సంచులు ఇవ్వొద్దు..


చినిగిన బస్తాలకు అతుకులు వేసి ధాన్యం నింపిన దృశ్యం

కల్లూరురూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చినిగిపోయిన పాత గన్నీ సంచులను సరఫరా చేయడం సరికాదని, వీటిలో ధాన్యం నింపితే మిల్లులకు తరలించేలోగా తరుగు వస్తోందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటా ధాన్యం తూకం వేసి బస్తాలకు కుట్లు వేస్తున్నారని, మిల్లులకు వెళ్లాక తరుగు వేస్తే నష్టం తాము భరించాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈమేరకు చినిగిన గన్నీ బస్తాలకు బదులు కొత్తవి ఇవ్వాలని మండలంలోని పలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు అబ్బూరి శ్రీనివాసరావు, రాంబాబు, కిష్టంశెట్టి రవి అధికారులను కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ యలగొండస్వామి

ముదిగొండ: మండలంలోని పండ్రేగుపల్లిలో ముదిగొండ సొసైటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ తుపాకుల యలగొండస్వామి సోమవారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీఈఓ వెంకటరత్నం, మాజీ జెడ్పీటీసీలు మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, కాంగ్రెస్ మండలాల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబుతో పాటు ఉసికల రమేష్, మల్లెల అజయ్, పసుపులేటి వెంకట్, ఓ.అమరయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు సడలించాలి

వైరా: సన్న రకాల ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిబంధనలు సడలించాలని సీపీఎం జిల్లా నాయకుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరాలో సోమవారం నిర్వహించిన స్టడీ సర్కిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనలు వరి సాగు చేసిన రైతులను అవమానించేలా ఉన్నాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మైక్రో మిషన్ విధానం వల్ల రైతులకు నష్టం జరుగుతున్నందున నిబంధనలు సడలించి అన్నిరకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో బొంతు సమత, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, తోట కృష్ణవేణి, నారికొండ అమరేందర్, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోలు చేస్తే చర్యలు

కారేపల్లి: రైతుల నుంచి లైసెన్స్ లేని వారు పత్తి కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని ఇల్లెందు మార్కెట్ చైర్మన్ రాంబాబు, కార్యదర్శి నరేష్‌కుమార్ తెలిపారు. కారేపల్లిలో సోమవారం వ్యాపారస్తులతో సమావేశమైన వారు మాట్లాడుతూ పల్లెల్లో తిరుగుతూ రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని పలువురు పత్తి కొనుగోలు చేస్తున్నట్లు తమకు తెలిసిందన్నారు. లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోలు చేయడం నేరమని గుర్తించాలని సూచించారు. కాగా, కారేపల్లిలోని శ్రీలక్ష్మిప్రియ మిల్లులో సీసీఐ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 6వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశామని, రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భద్రునాయక్, బాన్‌సింగ్, వ్యాపారులు సురేందర్ మనియార్, కాటేపల్లి నవీన్, అశోక్‌బూబ్, మంగీలాల్, సాయిరాం పాల్గొన్నారు.

ధాన్యం కాంటాలో తేడాలు

తల్లాడ: తల్లాడ మండలం నూతనకల్‌లోని కేంద్రంలో బస్తాకు 40కిలోల చొప్పున ధాన్యం కాంటా వేయాల్సి ఉండగా 41 కిలోలకు పైగా తూకం వేసి రైతులను మోసం చేస్తున్నారని రైతు సంఘం నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి విమర్శించారు. నూతనకల్‌లోని ధాన్యం కొనుగోలు సోమవారం పరిశీలించిన ఆయన 41.200 కిలోల చొప్పున నిర్వాహకులు పంపిస్తే మిల్లర్లు కొట్టేసి తక్కువ ధాన్యం నమోదు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లమోతు మోహన్‌రావు, కళ్యాణపు కృష్ణయ్య, అయినాల రామలింగేశ్వర్‌రావు, దారెల్లి కృష్ణయ్య, నరజసంహారావు, కళ్యాణపు వీరయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట అవశేషాలను కాల్చొద్దు

ఏన్కూరు: పంట అవశేషాలను కాలిస్తే వాతావరణ కాలుష్యం పెరగడమే కాక భూమిలో పంటలకు ఉపయోగపడే జీవులు నశిస్తాయని మండల వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు. మండలంలోని తూతకలింగన్నపేటలో వరి పంటలను సోమవారం పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు. కోతలు పూర్తయ్యాక వరి కొయ్యలను కాలిస్తే మట్టిలోని సూక్ష్మజీవులు దెబ్బతిని నేల సమతుల్యత కోల్పోతుందని, వాయు కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఈమేరకు అవశేషాలను భూమిలో కలియదున్నాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఈఓలు భవ్య, నవ్య తదితరులు పాల్గొన్నారు.

సాగుకు అడ్డుపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కారేపల్లి: పంటలు సాగు చేయకుండా అడ్డుపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఓ రైతు కుటుంబం కోరింది. కారేపల్లిలో రైతు ఈసాల ఎర్రయ్య కుటుంబీకులు సోమవారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. కోమట్లగూడెం రెవెన్యూ పరిధిలో తమ పేరిట 18ఎకరాల భూమిలో పంటలు సాగు చేస్తుంటే ఈసాల వెంకన్న, భరత్, కృష్ణకాంత్, సాయిలు అడ్డుపడుతున్నారని వాపోయారు. ఈ విషయమై కోర్టును ఆశ్రయించగా తమకే అనుకూలంగా తీర్పు వచ్చినా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎర్రయ్య కుటుంబ సభ్యులు కృష్ణయ్య, సుగుణమ్మ, పెద్ద ఎర్రయ్య, సత్యం, బాయమ్మ, ఉమ, విజయ, రమ తదితరులు పాల్గొన్నారు.

గ్రూపుల్లో కొత్త సభ్యులను చేర్పించాలి..

కల్లూరు: గ్రామీల వారీగా 18నుంచి 60 ఏళ్ల వయస్సు మహిళలను స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేర్పించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ బి.దర్గయ్య సూచించారు. కల్లూరులోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం జరిగిన ఉషోదయ మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ లింకేజీ రుణాలు, బీమా పథకాలు, శ్రీనిధి పథకం, చెల్లింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించిన ఆయన పథకాలను మహిళలకు వివరించి సభ్యులుగా చేర్పించాలని సూచించారు. తద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందే అవకాశముంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఎం ఎం.వెంకట్రామారావు, సీసీలు, గ్రామ దీపికలు, గ్రామ సమాఖ్య బాధ్యులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

సత్తుపల్లి/తల్లాడ: సత్తుపల్లిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. రాష్ట్ర నాయకులు పోట్రు వెంకటరామారావు, కనగాల సాంబశివరావు, పోట్రు సరస్వతి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా నాయకులు వినుకొండ రమేష్, మురళీరెడ్డి, వెంకటేశ్వరరావు, రమేష్, వెంకటరెడ్డి, మోహన్, చందు, మాచినేని విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే, తల్లాడలో టీడీపీ సభ్యత్వ నమోదును పార్టీ నాయకులు కనగాల సాంబశివరావు, కేతినేని హరీశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి వెంకటేశ్వరరావు, మొక్కా కృష్ణార్జున్, దుగ్గినేని వెంకటేశ్వరరావు, అయినాల నర్సింహారావు, చల్లా వెంకన్న, సరికొండ శ్రీనివాసరాజు, వెంకటరత్నం పాల్గొన్నారు.

సర్వేపై ఉపాధ్యాయుడి ప్రచారం

కల్లూరురూరల్: రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేపై కల్లూరు మండలంలోని చెన్నూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దంతాల సుధాకర్ విస్తృత ప్రచారం చేస్తున్నారు. సర్వేపై ప్రజల్లో అపోహలు ఉన్న దృష్ట్యా ఆయన బైక్‌కు మైకు బిగించుకుని గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరు సమగ్ర వివరాలు అందించాలని, తద్వారా పథకాల అమలు సులువవుతుందని చెబుతున్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడికి నివాళి

చింతకాని: మండలంలోని నాగులవంచకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు అంబటి వీరయ్య ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని సోమవారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు మడుపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపి, ఆలస్యం బస్వయ్య, ముత్తిని వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్ మజీద్, పర్చగాని సతీష్, నారపోగు కొండలరావు, అంబటి శాంతయ్య పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక పూజలు


సత్తుపల్లిటౌన్ : సత్తుపల్లిలోని ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


తల్లాడ : రామలింగేశ్వర దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్/తల్లాడ: కార్తీక మాసం సోమవారం సందర్భంగా ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామునే తలంటు స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగాలకు అభిషేకం చేయడమే కాక పుట్టల్లో పాలు పోసి నాగదేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. సత్తుపల్లి వెంగళరావునగర్‌లో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. అలాగే, తల్లాడలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పరమేశ్వరుడికి అభిషేక పూజలు జరిగాయి. అర్చకులు మణికంఠ శర్మ ఆధ్వర్యాన పంచామృతంతో అభిషేకం చేయగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

సత్తుపల్లి: స్వామియే అయ్యప్పా.. అంటూ భక్తుల శరణుఘోషతో సత్తుపల్లి మార్మోగింది. అయ్యగారిపేటలో నాగళ్ల శ్రీనివాసరావు కుమారుడు భాస్కర్ ఆధ్వర్యాన సోమవారం రాత్రి అయ్యప్పస్వామి పడి పూజ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొని పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుళ్ల కృష్ణయ్యతో పాటు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, రెడ్యం వీరమోహనరెడ్డి, దొడ్డా శంకర్‌రావు, దుగ్గిదేవర వెంకటలాల్, మల్లూరి అంకమరాజు, నరుకుళ్ల శ్రీను, మట్టా ప్రసాద్, పాల్గొన్నారు.


పడిపూజలో మాజీ ఎమ్మెల్యే సండ్ర, మాలధారులు

మధిర అయ్యప్ప స్వామి ఆలయంలో..

మధిర: మధిరలోని శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయాస్తమాన పూజలో మున్సిపల్ కౌన్సిలర్లు మల్లాది వాసు, సవిత దంపతులు పాల్గొన్నారు. అనంతరం మాలధారులకు అన్నదానాన్ని వారు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చలువాది ధర్మారావు, శ్రీనివాసరావు, దేవిశెట్టి రంగారావు, చెరుపల్లి శ్రీధర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్లు, భక్తులు

పలువురి కుటుంబాలకు పరామర్శ

తల్లాడ: మండలంలోని నూతనకల్, మిట్టపల్లిల్లో సోమవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పర్యటించారు. నూతనకల్‌లో ఇటీవల మృతి చెందిన గణేశుల సుశీల చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే, మిట్టపల్లిలో యరమల లక్ష్మీనర్సింహారెడ్డి, మేడి నరసింహ కుటుంబాలను పరామర్శించారు. నాయకులు దిరిశాల నర్సింహారావు, గణేశుల రవి, కొమ్మినేని వెంకటేశ్వర్లు, శీలం కోటారెడ్డి, ఆదూరి దాసురావు, పైడిపల్లి రవి, యాకూబ్, చిత్తలూరి రమేష్, రోశయ్య, మీర్జా మహబు పాల్గొన్నారు.

పెనుబల్లి మండలంలో...

పెనుబల్లి: ఎంపీ రఘురాంరెడ్డి సోమవారం పెనుబల్లి మండలంలో పర్యటించారు. కాంగ్రెస్ నాయకుడు కీసర శ్రీనివాసరెడ్డి ఇంటి వద్ద నాయకులు, కార్యకర్తలతో సమావేశమై గ్రామాల్లో సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీ ల్యాండ్స్ నిధులను అభివృద్ధి పనులకు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, సోమరాజు సీతారామారావు, రాజబోయిన కోటేశ్వరరావు, పంది వెంకటేశ్వరరావు, అలుగోజు చిన్నస్వామి, ఈడా కమలాకర్‌రావు, మిట్టపల్లి కిరణ్, వంగా దామోదర్, మేకతొట్టి కాంతయ్య, బుక్కా కృష్ణవేణి, దొంతు మాధవరావు, మాలోతు రాధాకృష్ణ, పిల్లి నవజీవన్, గూడూరు మాధవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడికి...

కొణిజర్ల: మండలంలోని చిన్నమునగాలలో విద్యుదాఘాతంతో గాయపడిన పంచాయతీ మల్టీపర్పస్ ఉద్యోగి(ఎలక్ట్రీషియన్) షేక్ నాగుల్‌మీరాను గోవవరం పీఏసీఎస్ చైర్మన్ చెరుకుమల్లి రవికుమార్ పరామర్శించారు. ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. మాజీ సర్పంచ్‌లు దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, షేక్ మదార్ సాహెబ్‌తో పాటు గుండెబోయిన నర్సింహారావు, కొత్తపల్లి నాగయ్య, బాదంశెట్టి పటేల్, మాదినేని రాంబాబు, షేక్ బడేసాహెబ్, ఇల్లందుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

కొణిజర్ల: కొణిజర్ల మండలంలోని పలు కేంద్రాల్లో గ్రూప్–3 పరీక్షలు సోమవారం ముగిశాయి. రెండు రోజులుగా విజయ ఇంజనీరింగ్ కళాశాల, బ్రౌన్స్ ఫార్మసీ కళాశాల, సెయింట్ అలోషియస్ పాఠశాల, గ్రేస్ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కార్తీక్ విద్యాలయంల్లో పరీక్షలు నిర్వహించగా ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. మొత్తం కేంద్రాల్లో 2,344 మంది అభ్యర్థులకు గాను రెండో రోజు 1,174 మంది హాజరు కాగా, 1,170 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 8.30 గంటల నుంచే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించి బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేశారు. వైరా ఏసీపీ ఎం.ఏ.రహమాన్ ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


విజయ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులు

బాలోత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ


వైరా : బహుమతులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

వైరా/తల్లాడ: ఇటీవల మధిరలో నిర్వహించిన జాతీయ స్థాయి బాలోత్సవ్ పోటీల్లో వైరాలోని వాణి వివేకానంద పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జానపద నృత్యం సహా వివిధ విభాగాల్లో బహుమతులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వాణి, కన్వీనర్ గింజుపల్లి జనార్దన్ సోమవారం అభినందించారు. అలాగే, తల్లాడలోని బాలభారతి విద్యాలయం విద్యార్థులు ఎస్.పీ.హిరణ్మయి, కె.భవాని, యజ్ఞ అవినాష్, మారుతీ లక్ష్మీ నరసింహ వివిధ విభాగాల్లో బహుమతులు గెలుచుకోగా కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ఇన్‌చార్జి యాచమనేని శశాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి

మధిర: పార్టీ సభ్యత్వ నమోదులో వేగం పెంచి సీపీఐ వందేళ్ల ఉత్సవాలకు సిద్ధం కావాలని ఆ పార్టీ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, బెజవాడ రవిబాబు కోరారు. మడుపల్లిలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్రజెండా పార్టీకి ఎదురులేదని తెలిపారు. పార్టీ స్థాపించి వందేళ్లు పూర్తవుతున్నందున ఉత్సవాలను వాడవాడలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి వూట్ల కొండలరావు, నాయకులు మడుపల్లి లక్ష్మణ్, రహీం, పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, శేషగిరిరావు, సిలివేరు శ్రీనివాసరావు, అన్నవరపు సత్యనారాయణ, రంగు నాగకృష్ణ, అప్పారావు, బ్రహ్మం, కొండ పాల్గొన్నారు.

వ్యాధుల నిర్మూలనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీరాజ్

మధిర: టీబీ, కుష్టు వ్యాధుల బారిన పడిన వారు ఆందోళన చెందకుండా ప్రభుత్వ వైద్యసేవలను ఉపయోగించుకోవాలని దెందుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్ సూచించారు. ఐకేపీ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. టీబీ, కుష్టు బాధితులకు ప్రభుత్వం విలువైన మందులను ఉచితంగా అందిస్తోందని తెలిపారు. ఈమేరకు బాధితులకు గ్రామ సమాఖ్యల బాధ్యులు అవగాహన కల్పించాలని కోరారు. ఐసీడీఎస్ సీడీపీఓ బాల త్రిపురసుందరి, ఏపీఎం రాంబాబు, ఉద్యోగులు సీహెచ్.వెంకటేశ్వర్లు, లంకా కొండయ్య, భారతి, రమాదేవి, కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.